నేడు మహాశివరాత్రి
ముస్తాబైన ఆలయాలు
హరోం.. హర..




హిందూ పండుగల్లో మహాశివరాత్రి ముఖ్యమైనది. బుధవారం మహాశివ రాత్రిని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలన్నీ ముస్తాబయ్యాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడనున్నాయి. శివనామం మార్మోగనుంది. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని, ఆలయాల వద్ద బారికేడ్లతోపాటు షేమియానాలు సిద్ధం చేశారు. జాగరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

-అనంతపురం కల్చరల్(ఆంధ్రజ్యోతి)



అలంకరణలో మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరుడు



విద్యుద్దీపాల వెలుగులో శివకోటి దేవాలయం



విద్యుద్దీపాలంకరణలో మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం



పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం



బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన హిమాలయాల సెట్టింగ్



ఉపాధి హామీ సామాజిక తనిఖీ (ఫైల్)

డ్వామా

విడపనకల్లు మండలంలో వింతలు
సొమ్ము స్వాహా చేసిన సిబ్బందిపై ప్రేమ

- తొలుత క్రిమినల్ చర్యలకు ఆదేశాలు
- ఉన్నఫలంగా ఆపేయాలంటూ ఉత్తర్వులు
- రికవరీ మాటున మాయలు
- సస్పెండ్ చేయకున్నా 20 రోజులుపైగా సిబ్బంది గైర్హాజరు

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో పెద్ద హైడ్రామా సాగుతోంది. విడపనకల్లు మండలంలో పెద్ద ఎత్తున అక్రమాలు బయటపడినా.. బాధ్యులపై చర్యలు మాత్రం శూన్యమనే చెప్పాలి. అక్రమాలు బయటపడినపుడు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించినా.. అధికారులే.. తర్వాత ఉన్నఫలంగా వద్దంటూ ఉత్తర్వులిచ్చారట. పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినా కనీసం సస్పెండ్ చేసిన పాపాన పోలేదు. ఎటువంటి చర్యలు తీసుకోకపోయినా.. ఎనిమిది మంది సిబ్బంది 20 రోజులుగా విధులకు గైర్హాజరవుతుండడం శోచనీయం. వారు సెలవు పెట్టారా, అనుమతి తీసుకున్నారా.. అన్నది కూడా అధికారులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారంటే ఎంత ఇష్టారాజ్యంగా వ్యవహారాలు సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

-ఆంధ్రజ్యోతి, విడపనకల్లు

రూ.1.5 కోటి స్వాహా

ఉపాధి హామీ పనుల్లో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసి రూ.1.5 కోట్లు కాజేసిన అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన అధికారులే తిరిగి క్రిమినల్ చర్యలు చేపట్ట వద్దు అంటూ ఆదేశాలు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని వివిధ గ్రామాల్లో 2023-2024 ఏడాదిలో రూ.11 కోట్లకుపైగా ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఈ పనుల్లో కంప్యూటర్ ఆపరేటర్ (సీఓ) సుభాన్, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి నకిలీ జాబ్ కార్డులను తయారు చేసినట్లు సామాజిక తనిఖీలో బయటపడింది. మండలంలోనే లేనివారి పేర్లను జాబ్‌కార్డుల్లో ఎక్కించి, ఫీనో అకౌంట్ ఏర్పాటు చేసి దాదాపు రూ.1.5 కోటి స్వాహా చేశారు. దీనిపై సామాజిక తనిఖీ అధికారులు రికార్డులతో సహా అవినీతి జరిగినట్లు నిరూపించారు. జిల్లా అధికారులు రెండు నెలల తరువాత స్పందించి ఈనెల 8వ తేదీన అవినీతి సిబ్బందిపై క్రిమినల్ చర్యలు చేపట్టారు. విడపనకల్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సిబ్బంది అవినీతి సొమ్మును కొంత తిరిగి చెల్లించారు.



చర్యలు నిలిపి వేయాలంటూ..

ప్రభుత్వోద్యోగులు ఎవరైనా అవినీతికి పాల్పడితే చట్టపరంగా విధుల నుంచి సస్పెండ్ చేస్తారు. కొంతమందిని ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తారు. మండలానికి చెందిన ఉపాధి హామీ సిబ్బంది రూ.కోట్లలో అవినీతికి పాల్పడినా.. జిల్లా అధికారులు వారిపై ప్రేమ చూపుతున్నారు. అవినీతి సొమ్ములో కొంత చెల్లించడంతో వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టవద్దు అంటూ జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఎంపీడీఓ షకీలా బేగం తెలిపారు.

బెదిరించేందుకేనా?

జిల్లా అధికారులు తలచుకుంటే ఏదైనా చేయగలరు అని మండలానికి చెందిన అవినీతి అధికారులపై వారు చూపిస్తున్న ప్రేమే నిదర్శనం. బోగస్ జాబ్ కార్డులతో రూ.కోట్లు అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు చేపట్టకుండా కేవలం రూ.18 లక్షలు అవినీతి జరిగిందంటూ రికవరీకి ఆదేశించారు. అందులో కొంత సొమ్ము చెల్లించిన వారిపై తదుపరి చర్యలు నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీలో ఎంత అవినీతి చేసినా అడిగేవారు ఉండరనీ, బయట పడితే ఎంతో కొంత చెల్లించి తిరిగి సంపాదించేకోవచ్చు అనే నమ్మకంతో సిబ్బంది బరితెగించి అవినీతికి పాల్పడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎవ్వరినీ సస్పెండ్ చేయలేదు


అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నట్లు తనకు ఉత్తర్వులు రాలేదు. పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు ఇచ్చాం. ఆ మేరకు కేసు నమోదైంది. కొంత అవినీతి సొమ్మును సిబ్బంది చెల్లించడంతో జిల్లా అధికారులు క్రిమినల్ చర్యలు నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేశారు. 8 మంది సిబ్బంది 20 రోజుల నుంచి విధులకు హాజరు కావటం లేదు.

-షకీలా బేగం, ఎంపీడీఓ, విడపనకల్లు

సిబ్బంది ఏమైనట్లు..?

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధి హామీ సిబ్బంది 20 రోజులుపైగా విధులకు హాజరు కావటం లేదు. సస్పెండ్ చేయకున్నా వారు విధులకు హాజరు కాకుండా తిరుగుతున్నారు. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వీరిపై ఏం చర్యలు తీసుకున్నారన్నది రహస్యమే. పాల్తూరు గ్రామంలోనే జగనన్న ఇళ్లలో రూ.7.5లక్షలు, ఒకరి ఖాతా నుంచి మరొకరికి, గ్రామంలోనే లేనివారి ఖాతాల్లోకి జమ చేశారు. అమెరికా, బెంగళూరు, హైదరాబాద్‌లో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కూడా ఇక్కడ పనులు చేసినట్లు రికార్డులు సృష్టించిన ఘనత విడపనకల్లు ఉపాధి హామీ సిబ్బందికే దక్కుతుంది. పాల్తూరులో రూ.28లక్షలు, డొనేకల్లు-ఆర్ కొట్టాల దారికి రూ.32 లక్షలు మండలం మొత్తం రూ.1.5 కోట్లు దుర్వినియోగం చేయగా.. రూ.18లక్షలు మాత్రమే అక్రమాలకు పాల్పడినట్లు తేల్చడాన్ని బట్టి చూస్తే మండల సిబ్బందికి జిల్లా అధికారులు ఎంతగా సహకరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సిబ్బందిపై చర్యలు తీసుకుంటారా, రూ.18లక్షలు మాత్రం రికవరీ చేసి చేతులు దులుపుకుంటారో వేచి చూడాలి.

ఎడారీకరణను నివారిస్తాం
అసెంబ్లీలో సీఎం హామీ



రాయదుర్గం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తరిస్తున్న ఎడారీకరణను నియంత్రించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలో మంగళవారం హామీ ఇచ్చారు. అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఎడారిగా మారిపోయే ప్రాంతమని, కాలవ శ్రీనివాసులు శాసనసభ్యుడిగా ప్రాతినిథ్యం వహించే రాయదుర్గంలో ఎడారిగా మారిపోయే ఆనవాళ్లు ఉన్నాయన్నారు. ఎడారిగా మారిపోకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యల కోసం నిధులు కేటాయించి నివారించే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. దేశంలోనే తక్కువ వర్షపాతం కురిసే జిల్లా అనంతపురం అయినప్పటికీ ఆర్థిక వ్యవస్థలో ఐదవ జిల్లాగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఒకటో రెండో స్థానానికి చేరుకుంటుందన్నారు.

ఆస్పత్రిలో అదనపు ఓపీ కౌంటర్లకు
అడుగులు
అడ్మినిస్ట్రేటర్ పరిశీలన
వైద్యులతో చర్చలు.. మరో నాలుగు ఏర్పాటు చేయాలని నిర్ణయం



వైద్యులు, సిబ్బందితో చర్చిస్తున్న ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' కథనంతో జిల్లా సర్వజనాస్పత్రిలో ఓపీ కష్టాలు పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. 'కిటకిట' శీర్షికన ఆస్పత్రిలో ఓపీ కష్టాలపై 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. ఆదయాన్నే ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున రెడ్డి ఓపీ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సౌజన్యకుమార్, ఇతర డాక్టర్లతో ఓపీ కౌంటర్ల సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రస్తుతం మహిళలు, పురుషులకు మూడు చొప్పున కౌంటర్లు ఉన్నాయన్నారు. సోమ, మంగళ, బుధవారాల్లోనైనా ఓపీ కష్టాలు తలెత్తకుండా మహిళలు, పురుషులకు మరో రెండు చొప్పున అదనంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అడ్మినిస్ట్రేటర్ తెలిపారు.

ఉష్ణోగ్రతలు


మంగళవారం

గరిష్ఠం	36.0
కనిష్ఠం	17.0

హెచ్చెల్సీకి మళ్లీ నీరు 6
కౌన్సిల్ వేదికగా వర్గపోరు 7
అడ్డగోలుగా హక్కులు..! 7



అనంతపురంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు





బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన హిమాలయాల సెట్టింగ్, హిమలింగం, హిమాలయాల సెట్టింగ్ ముందు దీపాలను వెలిగిస్తున్న మహిళలు

ఈశా..మహేశా..!

శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు... నేడు ప్రత్యేక పూజలు, అభిషేకాలు

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. పండుగ సందర్భంగా బుధవారం స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు సమాయత్తమయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పెనుకొండ సమీపంలోని ప్రకృతి ఒడిలో అలరారుతున్న శ్రీకైలాసం క్షేత్రంలో శివరాత్రి పర్వదినాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నారు. అనంత జిల్లాలోని కంబదూరులో వెలసిన మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. యాడికి మండలంలోని కోనుప్పలపాడు సమీపంలోని కోన రామలింగేశ్వరస్వామి ఆలయం కూడా పరమేశ్వరుడి పర్వదినానికి సిద్ధమైంది.

కొండ కోనల్లో రామలింగేశ్వరుడు



కోన రామలింగేశ్వరస్వామి

యాడికి, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): శివరాత్రి వేడుకలకు మండలంలోని కోన రామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబయ్యింది. ఏటా మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. ఇక్కడి శివలింగాన్ని పరశురాముడు ప్రతిష్ఠించినట్లు కోనుప్పలపాడు గ్రామ పెద్దలు చెబుతున్నారు. స్వామివారి దర్శనానికి యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల ప్రజలతోపాటు నంద్యాల జిల్లా ప్యాపిలి, అవుకు తదితర మండలాల ప్రజలు భారీగా తరలివస్తారు. ఆలయం చుట్టూ ఉండే కొండలతో ప్రకృతి రమణీయంగా గోచరిస్తుంది. ఆలయం ఎదురుగా ఉన్న కొలను గుండం, వర్షాకాలంలో కొలను గుండంలోని జాలువారే సహజ సిద్ధ జలపాతం కనువిందు చేస్తాయి. ఆలయం నుంచి అరకిలోమీటర్ దూరంలో కొండలపై నుంచి నిరంతరం జాలువారే సహజ సిద్ధ జలపాతం ఇక్కడి ప్రత్యేకత. వర్షాకాలంలో ఈ జలపాతం వద్దకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

అబ్బురపరిచే మర్రిచెట్టు



ఆలయం వద్ద ఎకరా విస్తీర్ణంలో ఉన్న మర్రిచెట్టు

కోనరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సుమారు ఎకరా విస్తీర్ణంలో పెద్దమర్రి చెట్టు విస్తరించి ఉంది. కోనకు వెళ్లిన భక్తులు చిన్న, పెద్ద తేడా లేకుండా మర్రి ఊడలు పట్టుకొని ఊయల ఊగుతుంటారు. కోనకు వెళ్లిన వారు మర్రిచెట్టు కిందనే సేదతీరుతుంటారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏపీ టూరిజం, పల్లెపండుగ కింద రూ.37లక్షలు, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి మరికొంత తన సొంత నిధులు వెచ్చించి కోనకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేశారు. ఆలయం వద్ద ఉన్న కోనేటి గుండంను శుభ్రం చేయించారు. భక్తుల వాహనాల పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



శ్రీకైలాసగిరి క్షేత్రంలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం

రేపు కల్యాణోత్సవం, రథోత్సవం

ఈనెల 27న కోన రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం ఓబులాపురం, కోనుప్పలపాడు గ్రామాల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నారు.

ఇలపై శ్రీకైలాసం



శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం

పెనుకొండ రూరల్: మహా శివరాత్రి వేడుకలకు శ్రీకైలాసం క్షేత్రం సిద్ధమయ్యింది. ఈ క్షేత్రం మండలంలోని గొందిపల్లి సమీపంలోని కొండల మధ్య ఉంది. పెనుకొండ నుంచి 20కి.మీ. దూరంలో ఉన్న ఇక్కడ ఆలయంలో శివుడు లింగం రూపంలో దర్శనమిస్తారు. శ్రీకైలాసగిరి శిఖరం నుంచి జాలువారే నీటి మధ్యన 40అడుగుల శివుడి విగ్రహం నిర్మించారు. ఏడుగురు అక్కమ్మగార్లు, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం దాతల సహకారంతో నిర్మించారు. శివరాత్రి పండగరోజు పెనుకొండ, ధర్మవరం తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి భక్తులు వస్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు తిరుపతిస్వామి తెలిపారు. బుధవారం తెల్లవారుజామునుంచే శ్రీకైలాసగిరి క్షేత్రంలో స్వామివారికి అఖండజ్యోతి, ఆలయం ముందు హోమాలు, కైలాసనాథుడి ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.



శ్రీకైలాసంలోని కోనేరు

మల్లేశ్వరుడి కల్యాణ వైభోగం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత కుటుంబసభ్యులు



స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

కళ్యాణదుర్గం: కంబదూరు మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, భార్య రమాదేవి, కోడలు ఇషిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కోడలు పరిటాల జ్ఞాన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న కంబదూరు మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఇద్దరు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం, రాప్తాడు ప్రాంత వాసులకు జీవనాడి అయిన పేరూరు, బీటీపీ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి కావాలని ఆ పరమేశ్వరుడికి ప్రత్యేకపూజలు చేశామని వారు వెల్లడించారు. వారికి వేద పండితులు మల్లేశ్వరస్వామి జ్ఞాపికను అందజేసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు



లేపాక్షిలో..

లేపాక్షి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహాగణపతి సుదర్శనహోమం, యాగాలు నిర్వహించారు. సాయంకాలం గ్రామోత్సవంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ధ్వజారోహణ, అంకురార్పణ విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు దీపోత్సవం, స్వామివారి కల్యాణోత్సవం

ఉత్సవాల్లో భాగంగా బుధవారం శివపార్వతుల కల్యాణవేదికగా ఆలయం మారనుంది. శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి, దుర్గాదేవి



పురవీధుల్లో ఊరేగుతున్న శివపార్వతులు

జాతీయ హాకీ జట్టుకు ఎంపిక



జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర మహిళా జట్టు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హాకీ జట్టుకు అనంతపురం, సత్యసాయి జిల్లా క్రీడాకారిణులు ఎంపికయ్యారు. నెల్లూరు నగరంలోని ఏసీ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ హాకీ పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన లక్ష్మీరేవతి, సత్యసాయి జిల్లాకు చెందిన పావని సత్తా చాటి జట్టులో స్థానం సంపాదించారు. మార్చి 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు వీరు ప్రాతినిథ్యం వహించనున్నారు. కాగా జాతీయజట్టుకు ఎంపికైన క్రీడాకారిణులకు నెల్లూరు ఏసీ స్టేడియంలో ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కే యతిరాజ్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ హాకీ పోటీల్లో సత్తా చాటాలన్నారు.

హెచ్చెల్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రామ్మోహన్

అనంతపురం టౌన్/క్లాక్‌టవర్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ బదిలీపై వచ్చారు. రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను ప్ర భుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న రామమోహన్‌ను హెచ్చెల్సీ భూసేకరణ విభాగానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న వసంతబాబు కళ్యాణదుర్గం ఆర్డీఓగా బదిలీ అయ్యారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు రుణాల ఇంటర్వ్యూలు మంగళశారం ముగిశాయి. జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 18మంది దరఖాస్తులు చేసుకోగా 14 మందిని ఎంపిక చేశారు. ముగ్గురు అభ్యర్థులకు అర్హతలు లేకపోవడంతో తిరస్కరించారు. మరొకరు గైర్హాజరయ్యారు. ఎంపికైన 14 మందికి రూ.33 లక్షల విలువైన యూనిట్లు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రక్రియలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ రాజశేఖర్, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటేశ్వర్, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక, మెప్మా పీడీ విశ్వజ్యోతి, గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి రామాంజనేయులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ వినోద్ పాల్గొన్నారు.

హెచ్చెల్సీకి మళ్లీ నీరు

అర టీఎంసీ విడుదల... కేసీ కెనాల్ వాటా మళ్లింపు

రాయదుర్గం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి అదనంగా అర టీఎంసీ నీటిని మంగళవారం సాయంత్రం బోర్డు అధికారులు విడుదల చేశారు. రోజుకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని అనంతపురం హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఇండెంట్ సమర్పించారు. కేసీ కెనాల్ వాటా నీటిలో అర టీఎంసీని హెచ్చెల్సీకు మళ్లించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. హెచ్ఎల్ఎంసీ, జీబీసీ ఆయకట్టులో ఆలస్యంగా పంటలు సాగు చేయడంతో రెండు తడుల నీరు అందిస్తే కోత చేసుకోవచ్చనీ, అందుకోసం అర టీఎంసీ నీరు కేటాయించాల్సిందిగా వీరు కోరారు. దీంతో పంటను కాపాడుకునేందుకు వీరి విన్నపాన్ని మన్నించి రైతుల శ్రేయస్సు కోసం అర టీఎంసీ నీటిని హెచ్చెల్సీకి మళ్లిస్తూ భారీ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు.. బోర్డు అధికారులకు ఉత్తర్వులను పంపించారు. ఈ నేపథ్యంలో అర టీఎంసీ నీటి విడుదలకు అంగీకరిస్తూ.. మంగళవారం సాయంత్రం డ్యాంలో విడుదల చేశారు. వారం క్రితమే ప్రభుత్వం అర టీఎంసీ నీరు అందించాలని ఉత్తర్వులు ఇచ్చినా.. కర్ణాటక మాత్రం కేసీ కెనాల్ నీటిని హెచ్చెల్సీకి మళ్లించకుండా అడ్డుకునే ప్రయత్నం చేసింది. బోర్డు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి హెచ్చెల్సీకి నీరు విడుదల చేయకుండా అడ్డుపడింది. అయినప్పటికీ మంత్రి, విప్ చొరవ చూపి బోర్డు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి కర్ణాటకను ఒప్పించడంలో సఫలీకృతులయ్యారు. దీంతో ఆలస్యంగానైనా మళ్లింపు జలాలు విడుదల చేశారు. రోజుకు 700 క్యూసెక్కుల ప్రకారం మార్చి 4వ తేదీ వరకు అర టీఎంసీ నీటిని తీసుకునేలా అధికారులు డిజైన్ చేశారు. ఇప్పటికే కర్ణాటక పరిధిలోని డిస్ట్రిబ్యూటరీల్లో జలచౌర్యానికి ఆస్కారం లేకుండా నేరుగా ఆంధ్ర సరిహద్దు వరకు నీరు చేరుకునేలా బోర్డు అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. సింగిల్ ఇండెంట్ కావడంతో 0.5 టీఎంసీల జలాల్లో ప్రవాహ నష్టం అధికంగానే ఉంటుంది. ఇప్పటికే కాలువలో నీరు పూర్తిగా ఎండిపోవడంతో ప్రవాహ వేగం కూడా మందకొడిగా ఉండి బుధవారం అర్ధరాత్రికి ఆంధ్ర సరిహద్దుకు జలాలు చేరుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఆ మేరకు ఏర్పాట్లను పూర్తి చేసి, జీబీసీ వరకు జలాలను తరలించేలా చర్యలు చేపట్టారు. హెచ్ఎల్ఎంసీ పరిధిలో ఉన్న మొక్కజొన్నతోపాటు జీబీసీలోని మిర్చి పంటలను నీటిని రెండు తడులుగా అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. జీబీసీ వరకు నీటిని ప్రవహించేలా చేసుకుని అక్కడ నుంచి ముందుకు వెళ్లకుండా కణేకల్లు చెరువు వద్ద నుంచి నీటిని వినియోగించుకునే విధానాన్ని అమలు చేస్తున్నారు.

జిల్లాను సారా రహితంగా మారుద్దాం

- సమీక్షలో కలెక్టరు, ఎస్పీ



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టరు, ఎస్పీ, జేసీ ఇతర అధికారులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు చైతన్యం కలిగించి, జిల్లాను సారా రహితంగా మారుద్దామని కలెక్టరు వినోద్‌కుమమార్, ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో నవోదయం2.0పై మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ నాటుసారా ప్రజల ఆరోగ్యాన్ని, ఆర్థిక మూలాలను దెబ్బతీస్తుందనే ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అధికారులందరూ పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు రెండునెలలు పాటు నిర్వహించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో మద్యం పీడిత గ్రామాలును ఏబీసీ కేటగిరీలుగా విభజించినట్లు తెలిపారు. ఏ కేటగిరీలో 24గ్రామాలు, బీ కేటగిరీలో 44గ్రామాలు, సీ కేటగిరీలో 36 గ్రామాలు ఉన్నాయన్నారు.

డ్రోన్లతో నాటుసారా ప్రాంతాలపై నిఘా: ఎస్పీ

నాటుసారా నివారణకు కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. నాటుసారా తయారు చేసే అటవీప్రాంతాలతో పాటు అనుమానం ఉన్న ఏరియాలలో డ్రోన్‌లతో తనిఖీలు నిర్వహిస్తూ నిఘా ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, ఆర్డీఓ కేశవనాయుడు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునుస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, విద్య వెల్ఫేర్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సహకార శాఖాధికారి అరుణకుమారి



మాట్లాడుతున్న డీసీఓ అరుణకుమారి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణకుమారి పేర్కొన్నారు. గుత్తిరోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల నిర్మాణ సంస్థలో ఐసీఎం గిడ్డంగి నియంత్రణ అభివృద్ధి వారి ఆధ్వర్యంలో గిడ్డంగుల వినియోగంపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి అరుణకుమారి, రాష్ట్ర ఐసీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్యాంకుమార్, గిడ్డంగుల నిర్మాణ సంస్థ డీఎం ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ రోషన్ జమీజర్, సీఈఓ శ్రీనివాసులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోతే రైతులు తమ దిగుబడులను నిల్వ చేసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగులను నిర్మించాయన్నారు. అద్దె చెల్లింపులు ప్రైవేట్ గిడ్డంగుల కంటే కూడా తక్కువేన్నారు. ప్రభుత్వ గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన దిగుబడులకు సంబంధించిన అధికారులు ఇచ్చే రసీదులను తీసుకువెళ్లి బ్యాంకులో రుణాలు కూడా పొంద వచ్చునన్నారు. కార్యక్రమంలో కొడిమి, నరసనాయనికుంట, సోములదొడ్డి, పాములాయి. కురుగుంట, అక్కంపల్లి, నాగిరెడ్డిపల్లి, రాచానపల్లి, చిన్నంపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పీ4 సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న శ్రీమంత్‌సాయి

బత్తలపల్లి ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లితోపాటు మండలంలోని పోట్లమర్రిలో మం గళవారం పీ4 సర్వే రాష్ట్ర పరిశీలకుడు శ్రీమంత్‌సాయి పర్యటించారు. సర్వే తీరును పరిశీలించారు. సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వేపై అపోహలు అవసరం లేదని ప్రజలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో గణాంకాల అధికారి శర్మ, వీఆర్వో రాణాప్రతాప్ పాల్గొన్నారు.

అడ్డగోలుగా హక్కులు..!

వైసీపీ పాలనలో ఫ్రీహోల్డ్ మాటున అంతులేని అక్రమాలు.. బాధ్యులపై చర్యలు కరువు

పుట్టపర్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డ్ మాటును గత వైసీపీ పాలనలో యథేచ్ఛగా భూఆక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ నాయకులు, ఆ పార్టీ అనుకూల వ్యాపారులు పేదల భూములను అడ్డదారుల్లో కొట్టేశారు. రెవెన్యూ యంత్రాంగం సహకరించడంతో అంతులేని అక్రమాలు సాగించారు. అసైన్డ్ ఫ్రీహోల్డ్ నిషిద్ధ జాబితా నుంచి తప్పించి భూములను కాజేసి లబ్ధి పొందారు. ఫ్రీహోల్డ్ మాటున జిల్లాలో వేల ఎకరాల్లో వందల కోట్ల రూపాయల విలువైన అసైన్డ్ భూదందా సాగింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ పేరుతో జరిగిన భూఅక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు కూటమి సర్కారు నిర్ణయించింది. దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేశారు. ఫ్రీహోల్డ్, నిషేధిత భూములను వైసీపీ నేతలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై యథేచ్ఛగా కొట్టేశారు. భూఅక్రమాల్లో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ఫ్రీహోల్డ్‌తోపాటు రిజిస్ట్రేషన్లలో అక్రమాల పరంగా టాప్ 10 మండలాల జాబితాను సీసీఎల్ఏ ప్రకటించింది. అందులో జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన భూముల పరంగా ముదిగుబ్బ అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత మరో ఐదు మండలాలున్నాయి. ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లలో పెనుకొండ అగ్రస్థానంలో నిలిచింది. భూచోళ్లకు వందల కోట్ల విలువైన భూములు కట్టబెట్టేందుకు సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకునే వారెవరన్న చర్చ సాగుతోంది.

కలెక్టరేట్





ఫ్రీగా లక్షల ఎకరాలు..

జగన్ పాలనలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని అసైన్డ్ ఫ్రీహోల్డ్ భూముల (యాజమాన్య హక్కుల కల్పన) ముసుగులో నిషిద్ధ 22(ఏ) జాబితా నుంచి అక్రమంగా తప్పించడమే కాకుండా కొన్నింటికి రిజిస్ట్రేషన్లు చేయించి అసైన్డ్ చుక్కల, ఇనామ్, షరతుగల, అసైన్డ్ పట్టా ఫ్రీహోల్డ్ భూములను దోచేశారు. 2003 ఏడాదికి ముందు అసైన్డ్‌మెంట్ భూములకు మాత్రమే ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాల్సి ఉన్నా.. తర్వాత ఇచ్చిన వాటికీ చోటు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా జిల్లాలో 32 మండలాల్లో 2,57,042.47 ఎకరాలను ఫ్రీహోల్డ్ పరిశీలించగా.. ఏకంగా 1,26,215 ఎకరాలు అడ్డగోలుగా కట్టబెట్టినట్లు విచారణలో లెక్కతేల్చారు. ఇందులో 1,26,215.19 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఫ్రీహోల్డ్ కల్పించిన భూముల్లో 5242.08 ఎకరాలను రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఇందులో నిబంధనలు అతిక్రమించి 2,141.01 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారులు తేల్చారు. ఫ్రీహోల్డ్ చేసిన, రిజిస్ట్రేషన్ జరిగిన భూముల్లో అత్యధికంగా వైసీపీ నేతలతోపాటు ఆ పార్టీ అనుకూల స్థిరాస్తి వ్యాపారులు కొందరు బినామీల పేరుతో ముందస్తు అగ్రిమెంట్లు, కొనుగోళ్లు చేశారు. ఇదే అదునుగా తీసుకుని ఆయా నియోజకవర్గాల్లో కీలక ప్రజాప్రతినిధులు, నేతలు భూకబ్జాదారుల అవతారమెత్తారు. దేవదాయ, వంక పోరంబోకు, పరిశ్రమలు, అటవీ ఇలా అనేక రూపాల్లో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి, ఫ్రీహోల్డ్ కల్పించుకుని భూదందా చేశారు.

అక్రమాల్లో అగ్రస్థానం

రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ చేసిన భూములతోపాటు ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగిన మండలాల జాబితాను ప్రభుత్వం విడుదల చేస్తే మొదటి స్థానంలో ముదిగుబ్బ, రెండో స్థానంలో అమరాపురం, మూడో స్థానంలో రామగిరి నిలిచాయి. 6, 7, 9 స్థానాల్లో కనగానపల్లి, సోమందేపల్లి, పెనుకొండ నిలిచాయి. ముదిగుబ్బలో 14,509.88 ఎకరాలను ఫ్రీహోల్డ్‌గా మార్చితే ఇందులో 13,538.48 ఎకరాలు అక్రమమని తేలింది. అమరాపురం మండలంలో 18,281.76 ఎకరాలకుగాను 10781.27 ఎకరాలు, రామగిరిలో 19877.20కిగాను 10410.83, కనగానపల్లిలో 14039.83కిగాను 8300.08, సోమందేపల్లిలో 10582.38కిగాను 7785.90, పెనుకొండలో 16205.06కిగాను 7501.68 ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. పెనుకొండ మండలంలోని నాగలూరు, ఎర్రమంచి, శెట్టిపల్లి, మునిమడుగు, ధర్మవరం మండలంలోని కుణుతూరు, చిగిచెర్లలో భారీగా ఫ్రీహోల్డ్‌లో అక్రమాలు వెలుగుచూశాయి.





ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్లలోనూ..

ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్లలోనూ రాష్ట్రంలో టాప్ 10 జాబితాలో పెనుకొండ అగ్రస్థానం కైవసం చేసుకుంది. మూడోస్థానంలో ధర్మవరం, 6, 9 స్థానాల్లో సోమందేపల్లి, రొద్దం నిలిచాయి. పెనుకొండ, ధర్మవరం, చిలమత్తూరు, హిందూపురం, బుక్కపట్నం, సీకేపల్లి, కదిరి, మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధికంగా ఫ్రీహోల్డ్ అసైన్డ్ రిజిస్ట్రేషన్లు జరిగిగాయి. పెనుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోనే సోమందేపల్లి, రొద్దం, పెనుకొండ మండలాల్లో ఫ్రీహోల్డ్ చేసిన రిజిస్ట్రేషన్లలో వ్యాత్యాసాలతోపాటు అక్రమాలు జరిగినట్లు నిగ్గతేల్చారు. పెనుకొండలో 827.39 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయగా.. 326.10 ఎకరాలు అక్రమమే. ధర్మవరంలో 372.11 ఎకరాలకుగాను 264.49, సోమందేపల్లిలో 458.98కిగాను 207.56, రొద్దంలో 442.04కిగాను 194.15 ఎకరాలు అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు అధికారులు గుర్తించారు.

అక్రమార్కులపై చర్యలేవీ?

వైసీపీ పాలనలో ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు రియల్ మాఫియా ముందస్తు ప్రణాళికతో పేదలు, మధ్యతరగతి వర్గాల అసైన్డ్ భూములను కారుచౌకగా కొనుగోలు చేశారు. పనిలో పనిగా రెవెన్యూలో కొందరు బేరం పెట్టారు. ఇష్టారాజ్యంగా ఫ్రీహోల్డ్ చేశారు. అక్రమాల పరంగా టాప్-10 మండలాల్లో అప్పట్లో ఆయా మండలాల్లో పనిచేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ ఈనెల 4న జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. అయినా.. నేటికీ చర్యలకు ఉపక్రమించలేదన్న చర్చ నడుస్తోంది. ఫ్రీహోల్డ్ అక్రమాల మండలాల్లో పనిచేసిన తహసీల్దార్లతోపాటు ఉద్యోగులు చాలామంది బదిలీ అయ్యారు. ప్రస్తుతం జిల్లాలో కీలక మండలాల్లో పనిచేస్తున్నారు. కొందరు రెవెన్యూ ఉద్యోగులు ఆయా మండలాల్లో పక్క గ్రామాల్లోనే పనిచేస్తున్నారు. వారందరిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. క్షేత్రస్థాయి పరిశీలనలతో ఫ్రీహోల్డ్ అక్రమార్కుల్లో మొదట్లో ఆందోళన రేగింది. చర్యలు చేపట్టకపోవడంతో వారు కూడా పెద్దగా పట్టించుకోవట్లేదు. ఈ నేపథ్యంలో సీసీఎల్ఏ ఆదేశాలతోనైనా ఫ్రీహోల్డ్ అక్రమార్కులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో, లేదో.. వేచిచూడాలి.

టిప్పర్ కింద పడి యువకుడి దుర్మరణం

ధర్మవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టిప్పర్ కింద పడి ఓ యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం పట్టణంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు...పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పెద్దపోతలయ్య కుమారుడు వినోద్‌కుమార్(20) పదో తరగతి వరకు చదివి, తండ్రితో పాటు నాయిబ్రాహ్మణ వృత్తిని చేసేవాడు. ఈ క్రమంలో సిమెంట్ ఇటుకల లోడుతో ఓ టిప్పర్ బత్తలపల్లి వైపు నుంచి ధర్మవరం పట్టణంలోకి వెళ్తోంది. కదిరి గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు చేస్తున్నారు. అక్కడ వన్‌వే ఉంది. కదిరి గేటు వద్దకు టిప్పర్ రాగా, అదే సమయంలో వినోద్‌కుమార్ ద్విచక్రవాహనంపై పట్టణంలోకి బయల్దేరాడు. టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేసే సయంలో పక్కనే ఉన్న బురదగుంటలో ద్విచక్రవాహనం జారడంతో యువకుడు టిప్పర్ కిందపడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒకగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు.



వినోద్‌కుమార్ (ఫైల్)

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారయత్నం

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువతిపై మంగళవారం అదే ఊరికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు మతిస్థిమితం లేని ఒంటరి యువతిపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. గట్టిగా కేకలు వేయడంతో పారిపోయాడు. కూలి పనులకు వెళ్లిన తల్లిదండ్రులు వచ్చిన తర్వాత ఆ యువతి వారికి విషయం తెలిపింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ యువరాజు విచారణ చేపట్టారు.

బాలికకు వివాహం

ఐదుగురిపై కేసు నమోదు

కూడేరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలికకు వివాహం చేయడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని ఓ గ్రామంలో మైనర్‌కు వివాహం చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందింది. సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ అరుణమ్మతోపాటు పోలీసులు.. బాలిక కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, వివాహం చేయమని హామీ పత్రం రాయించుకున్నారు. అయినా ఈనెల 16న అనంతపురం నగరానికి చెందిన ఓ వ్యక్తితో బాలికకు వివాహం అయినట్లు ఫొటోలు బయటకు రావడంతో అప్రమత్తమైన ఐసీడీఎస్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పెళ్లి కొడుకుతోపాటు, ఇరువురి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బాలికను ఐసీడీఎస్ అధికారులు పిల్లల హోంకు తరలించారు.

పార్ట్‌నర్స్‌కు టోకరా

రూ.60లక్షలతో ఉడాయించిన వైనం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ప్యాకేజీ టూర్ పేరుతో అనంతపురం నగరానికి చెందిన సనత్‌కుమార్ రూ.60లక్షలతో ఉడాయించాడు. ఈ విషయంపై అతడితో పాటు భాగస్వాములుగా ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌లోని రాణిపూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుంచపు సాంబశివుడు, మలే రామారావు, మడుపూరు శ్రీహరి, కాళసముద్రం సనత్‌కుమార్‌తో కలిసి టూరిస్ట్ ప్యాకేజీ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలోనే ఫిబ్రవరి 21న 237మంది మూడు రాత్రులు, నాలుగు పగళ్లు ఉండేలా ప్యాకేజీని బుక్ చేసుకున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. టూరిస్ట్ ప్యాకేజీలో భాగంగా హైదరాబాద్, బెంగళూరు, త్రివేండ్రం, నుంచి బాగ్డోగ్రాకు విమాన టిక్కెట్లను కొనుగోలు చేశారు. ఇందు కోసం సుమారు రూ.60లక్షలు ఖర్చు చేశారు. గాంగ్‌టక్ చేరుకోగానే సంబంధిత వ్యక్తులు విమాన టికెట్‌ల మొత్తం ఈనెల 21న రూ.60లక్షలు చెల్లించారు. అయితే సనత్‌కుమార్ మొత్తం డబ్బు తీసుకొని కనిపించకుండా పోయాడు. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మిగిలిన ముగ్గురు అతడిపై అక్కడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వాణిజ్య పన్నుల శాఖలో కలకలం

వర్గపోరు.. జీరో ఎఫెక్ట్‌తో నలుగురిపై వేటు

సీటీఓ, ముగ్గురు డీసీటీఓల సస్పెన్షన్

హిందూపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖలో ఒకే కార్యాలయంలో పనిచేస్తున్న నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేయడం కలకలం రేపింది. వర్గపోరు, అవినీతి ఆరోపణలు, వేధింపులు, క్రమశిక్షణ రాహిత్యం, జీరో వ్యాపారం ఎఫెక్ట్‌తో వేటు పడింది. హిందూపురంలోని సహాయ కమిషనర్, రాష్ట్ర పన్నులశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న వాణిజ్య పన్నుల శాఖాధికారి (సీటీఓ) కృష్ణవేణి, ఉప వాణిజ్య పన్నుల శాఖాధికారు (డీసీటీఓ)లు రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఇంతియాజ్ బాషాను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొంపముంచిన వర్గపోరు

హిందూపురం వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో సీటీఓ, డీసీటీఓలు కింది స్థాయి సిబ్బంది వర్గపోరులో మునిగారు. ఇక్కడ పనిచేస్తున్న ఓ డీసీటీఓ.. ఉన్నతాధికారిపై ఆర్టీఐ యాక్ట్ ద్వారా కొంత సమాచారాన్ని వేరేవారి ద్వారా కోరారు. ముఖ్య అధికారి అప్పటి నుంచి కొంత గుర్రుగా ఉన్నారు. గతేడాది సెప్టెంబరు 27న సీటీఓగా కృష్ణవేణి బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత నుంచి కార్యాలయంలో వర్గపోరు లోలోపలే సాగుతోంది. ఇటీవల ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అక్కడ వారి మధ్య సఖ్యతలేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారులు దీనిని సీరియస్‌గా పరిగణించారు.

జీరో ఎఫెక్ట్..

ఉమ్మడి జిల్లాలోనే హిందూపురం వాణిజ్యకేంద్రంగా పేరుగాంచింది. రాష్ట్ర సరిహద్దులో ఉంది. దీంతో ఇక్కడ జీరో వ్యాపారం జోరుగా సాగుతోందనీ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ ఎగ్గొడుతున్నట్లు తెలిసింది. ఆ శాఖలో పనిచేస్తున్న వారికి ప్రతినెలా లక్షల్లో వ్యాపారం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పన్ను వసూళ్లలో కార్యాలయంలో పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. పట్టుచీరలు మొదలుకుని గుజిరీ వ్యాపారం వరకు జీరోలో నడుస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఓవైపు కార్యాలయంలో మూడు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తం అయ్యాయి. వీరు ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో హిందూపురంలో ఏం జరుగుతుందోనని విచారణకు ఆదేశించారు.





విచారణ నివేదిక అందగానే చర్యలు

హిందూపురం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు పన్నులు రాబట్టే కన్నా.. సంపాదనలోనే పోటీపడినట్టు తెలిసింది. హిందూపురం నుంచి నిత్యం ఇతర ప్రాంతాలకు వేలాది చీరలు వెళ్తుంటాయి. దీనిపై 5 శాతం జీఎస్టీ చెల్లించాలి. ఇక్కడ కొంతమంది అధికారులు జీఎస్టీ కంటే సొంత జేబులు నింపుకోవడానికి ప్రాధాన్యమిచ్చినట్లు సమాచారం. కర్ణాటక నుంచి డీజిల్ పెద్ద ఎత్తున తరలిస్తుంటారు. కియ పరిశ్రమ వద్ద వందలాది వాహనాలకు కర్ణాటక నుంచి డీజిల్ సరఫరా అవుతున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణలో తేల్చారు. నిత్యం వేలాది లీటర్లు డీజిల్ కర్ణాటక నుంచి ఇక్కడికి వస్తుండటంతో ఇది పన్నుల శాఖ అధికారులకు తెలిసి కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆరాతీసినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఈనెల 17న విచారణకు వచ్చిన అధికారి కార్యాలయంలో వర్గపోరుతోపాటు వ్యాపారుల నుంచి జీఎస్టీ, కొంతమందిని బెదిరించి వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించారు. ఆ శాఖ అదనపు కమిషనర్ నాగేంద్ర, సంయుక్త కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణ.. డీలర్లతో సమావేశమయ్యారు. సీటీఓ, డీసీటీఓ, ఏసీటీఓ, సీనియర్ అసిస్టెంట్లను వేర్వేరుగా విచారించి, నివేదికను కమిషనర్ పంపారు.

కలకలం

హిందూపురం వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సీటీఓ, ముగ్గురు డీసీటీఓలను సస్పెండ్ చేయడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆ శాఖలో కలకలం రేగింది. నెలరోజులుగా హిందూపురం పన్నులశాఖ కార్యాలయం రచ్చకెక్కింది. దీంతో రాష్ట్ర అధికారులు ఆగమేఘాల మీద స్పందించి నలుగురిపై వేటు వేశారు. ఆ కార్యాలయంలో పనిచేస్తున్న మరికొంతమందిలో వణుకు పుట్టింది. నలుగురితోనే సరిపెడతారా, తమపై కూడా చర్యలుంటాయా అని ఆందోళన చెందుతున్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుతున్న వృషభాలు

పామిడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నప్పగుడి వద్ద ఎర్రితాత పక్కీరప్ప ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. న్యూ కేటగిరీ విభాగంలో 10 కాండ్లు(జతలు) తలపడ్డాయి. వీటిలో అనంతపురం జిల్లా అక్కంపల్లె గ్రామం ఇంద్రారెడ్డికి చెందిన వృషభాలు 6058.8 అడుగులు రాతిదూలంను లాగి మొదటి బహుమతి రూ.50వేలు కైవసం చేసుకున్నాయి. మొదటి బహుమతిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రూ. 50వేలు అందజేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన రాజశేఖర్‌రెడ్డి బ్రదర్స్ ఎద్దులు 5900 అడుగులు లాగి రెండో బహుమతి రూ. 35వేలు దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా మల్లెల మండలం డీ రంగాపురం గ్రామం రామకృష్ణారెడ్డి వృషభాలు 5800 అడుగులు లాగి మూడో బహుమతి రూ.25వేలు సొంతం చేసుకున్నాయి. కర్నూలు జిల్లా పీ రుద్రవరం ఎల్లా గౌడ్, డీ రంగాపురం రామచంద్రారెడ్డికి చెందిన ఎద్దులు 5577.9 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ. 15వేలు సాధించాయి. కర్నూలు జిల్లా బోగులు శేషయ్య, మల్లెల ఎస్ఎస్‌వీ ట్రేడర్స్ వృషభాలు 5200 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.10వేలు కైవసం చేసుకున్నాయి. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. బుధవారం ఆరు పళ్ల విభాగము వృషభాల రాతిదూలం లాగుడు పోటీలు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కౌన్సిల్ వేదికగా వర్గపోరు

రాయదుర్గం వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

రెండు గ్రూపులుగా చీలిన వైసీపీ కౌన్సిలర్లు

రసాభాసాగా మారిన కౌన్సిల్ సమావేశం



మహిళా కౌన్సిలర్‌తో వాదిస్తున్న మరో సభ్యుడు

రాయదుర్గం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఉన్న వర్గపోరు కౌన్సిల్‌మీట్‌లో భగ్గుమంది. రాయదుర్గం మున్సిపల్ కౌన్సిలర్ల మధ్య మంగళవారం వివాదం తారస్థాయికి చేరుకుంది. రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు అసభ్య పదజాలంతో దూషించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గ పోరాళ్ల శిల్పపై అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి దించేయాలని ఒక వర్గం, ఆమెను కొనసాగించాలని మరో వర్గం పోరాడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి సగం మంది కౌన్సిలర్లు హాజరు కాలేదు. 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం కౌన్సిలర్ల గైర్హాజరుతో ఆలస్యంగా ప్రారంభించారు. చివరకు 16 మంది కౌన్సిలర్లు హాజరుకావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ సమావేశాన్ని ప్రారంభించారు. అప్పటికే ఆగ్రహంతో ఉన్న కౌన్సిలర్ అజయ్ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు తగినంత మంది సభ్యులు లేనపుడు ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. ఈక్రమంలోనే ఒక్కొక్కరు చైర్‌పర్సన్‌పై ఉన్న అసంతృప్తిని వెళ్లగక్కుతూ స్వరం పెంచారు. ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇదే క్రమంలో కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు దూషణలు ప్రారంభించారు. అధికారులు సముదాయించే ప్రయత్నం చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో రెండు గ్రూపులుగా చీలిపోయిన వైసీపీ కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకునే స్థాయికి వెళ్లారు. పరిస్థితిని గమనించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సమావేశాన్ని 4 గంటలకు వాయిదా వేశారు. దీంతో గందరగోళ పరిస్థితి కౌన్సిల్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి చాంబర్‌కు చేరుకుంది. అక్క డ ఉన్న కొందరు కౌన్సిలర్ల భర్తలు వైసీపీ నాయకులు కౌన్సిలర్లతో పాటు చాంబర్‌లోకి ప్రవేశించి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఒక వైపు 13 మంది మరో వైపు 14 మంది రెండు గ్రూపులుగా విడిపోయి ఎక్కడికక్కడ విడివిడిగా వాగ్వాదాలు చేసుకుంటూ దాడులు చేసుకునే స్థాయికి పరిస్థితి వెళ్లింది. మున్సిపల్ కమిషనర్ పరిస్థితిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా రూ.50 వేలు తీసుకుని సమావేశానికి వచ్చారని కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి మహిళ కౌన్సిలర్‌పై ఆరోపణలు చేయడంతో చైర్‌పర్సన్ సహా మహిళా కౌన్సిలర్లంతా ఆయనపై తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఒకొక్కరిగా అక్కడి నుంచి పంపేయడంతో వివాదం సద్దుమణిగింది. వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఉన్న చిచ్చు కారణంగా ప్రజా సమస్యలు చర్చించే పరిసితి లేకుండా పోయిందని టీడీపీ కౌన్సిలర్లు ప్రశాంతి, జ్యోతి మండిపడ్డారు. వైసీపీలో ఉన్న వర్గపోరును తీసుకొచ్చి మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి అంటగట్టడం సరైంది కాదని వారు హితవు పలికారు.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ. 16తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 119 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 530 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 8, కనిష్ఠ ధర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.

వామ్మో..! ఎయిడ్స్?

హత్యాయత్నం బాధితురాలికి పాజిటివ్..

నిందితుడికి కూడా..

ఆమెతో సన్నిహితంగా మెలిగిన వారిలో టెన్షన్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎవరినైనా చంపడానికి ప్రయత్నిస్తే కేసు, రిమాండు లాంటివి ఉంటాయి. కానీ ఎయిడ్స్ రావడమేంటి? ఇటీవల జరిగిన ఓ హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి ఇలానే జరిగింది. ఇటీవల ఓ మహిళపై ఓ వ్యక్తి హత్యాయత్నం చేశాడు. ఆమెకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేయగా ఆమె ఎయిడ్స్ బారిన పడినట్లు తేలింది. దాడికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు పెట్టే సమయంలో పోలీసులు పరీక్ష చేయించగా.. అతడికి కూడా ఎయిడ్స్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఆ మహిళ మరికొంతమందితో సన్నిహితంగా మెలిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వారందరూ టెస్టుల కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, ప్రభుత్వాసుపత్రి, ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నట్లు సమాచారం.

ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఐటీఐ విద్యార్థి పవన్‌కుమార్ (20) మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకటేసులు తెలిపిన మేరకు నార్పల మండలం నర్సాపురానికి చెందిన గుజ్జల రామాంజనేయులు, గుజ్జల లక్ష్మిదేవి దంపతులకు ఇద్దరు సంతానం. పెద్దవాడు అయిన పవన్‌కుమార్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో డ్రాఫ్టుమెన్ సివిల్ బ్రాంచులో రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈక్రమంలోనే వ్యసనాలకు అలవాటు పడినట్లు తెలిసింది. దీంతో రెండు నెలలుగా ఇంటికి కూడా వెళ్లకుండా నగరంలోనే ఉండిపోయాడు. తల్లిదండ్రులు నగరానికి వచ్చి వ్యసనాలు మానుకొని, బుద్ధిగా చదువుకోవాలని మందలించి వెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన పవన్‌కుమార్ స్థానిక పీటీసీ సమీపంలోని లక్ష్మినగర్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ వెంకటేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. అయితే ప్రేమ విఫలం కావడంతోనే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడన్న ప్రచారం జరుగుతోంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



బంగారు కవచంతో అలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రమ్మణ్యేశ్వర స్వామికి మాఘమాసం చివరి మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, బంగారు కవచ అలంకరణ చేశారు. ఉత్స విగ్రహంతో పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకులు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి

● కేహెచ్ ఫౌండేషన్ చైర్మన్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను విస్మరించే వారిని కఠినంగా శిక్షించేలా ప్రత్యేకంగా సంరక్షణ చట్టాన్ని రూపొందించాలని కేహెచ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎండీ నాగభూషణం పేర్కొన్నారు. భిక్షాటన చేస్తున్న వృద్ధులకు మంగళవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో సేవలందించారు.

అమెరికా వర్సిటీతో మిట్స్ కళాశాల ఒప్పందం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పరిశోధనల కోసం అమెరికా బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ (బీజీఎస్‌యూ)తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నటు మంగళవారం జేఎన్‌టీయూ అనుబంధ మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యువరాజ్ ప్రకటనలో తెలిపారు. బీజీఎస్‌యూ ప్రతినిధులు రామ్, వేల్ మొఖ్తార్, జాన్, ఎర్డోగ్మస్‌తో ఒప్పంద పత్రాలను మార్చుకున్నట్లు పేర్కొన్నారు. అమెరికాలో ఉన్నత విద్యనభ్యసించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని కళాశాల చైర్మన్ డాక్టర్ విజయభాస్కర్ చౌదరి ప్రశంసించారని తెలిపారు.

అనధికార లేఅవుట్లను ఉపేక్షించేది లేదు

● అహుడా చైర్మన్ టీసీ వరుణ్ హెచ్చరిక



అధికారులతో మాట్లాడుతున్న టీసీ వరుణ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో అనధికార లేఅవుట్లను వేస్తే ఉపేక్షించేది లేదని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ హెచ్చరించారు. ఆయన మంగళవారం అహుడా కార్యాలయంలో ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, జేపీఓ హరీష్‌తో అనధికార లేఅవుట్ల అంశంపై సమీక్షించారు. అహుడా పరిధిలోని 57మండలాలు, 993 గ్రామ పంచాయతీల్లోని లేఅవుట్లు, వాటికి అనుమతులపై చర్చించారు. ఇప్పటికే ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో కూడిన రెండు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు పర్యటిస్తున్నాయని ఆయన తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

గార్లదిన్నె, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి ఆదివారం వెళ్లిపోయిన మర్తాడు గ్రామానికి చెందిన ఏడో తరగతి శశికుమార్ మంగళవారం అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డులో ప్రత్యక్షమైనట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం అనంతపురం మార్కెట్‌యార్డులో ఉన్నట్లు తెలుసుకున్న విద్యార్థి తండ్రి సుధాకర్ అక్కడికి వెళ్లి శశికుమార్‌ను తీసుకొచ్చాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసుల అనుమతితో విద్యార్థిని ఇంటికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

శింగనమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మండలంలోని ఉల్లికల్లు గ్రామానికి చెందిన బొమ్మన హరి(22) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హరి, భార్య సుస్మిత వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించేవారు. కుటుంబంలో కలహాలతో హరి సోమవారం రాత్రి మద్యం తాగి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సుస్మిత ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు న్యాయవాది మూర్తి పేర్కొన్నారు. నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం ఉరవకొండ నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గం అధ్యక్షుడిగా శీన, మండల అధ్యక్షుడిగా వన్నూర్ సాబ్, పట్టణ అధ్యక్షుడిగా వీరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా ఓబులేశు, వజ్రకరూరు మండల అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కూడేరు మండల అధ్యక్షుడిగా పవన్‌కుమార్, విడపనకల్లు మండల అధ్యక్షుడిగా కరీం, ప్రధాన కార్యదర్శిగా చంద్రను ఎన్నుకున్నారు. వారికి ఆ సంస్థ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి శేఖర్, పురుషోత్తం, యోగానందరెడ్డి, అబ్బాస్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులను సత్కరిస్తున్న కరస్పాండెంట్లు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన మార్కులు సాధించి ప్రతిభావంతులుగా నిలిచిన పలువురు విద్యార్థులను ప్రసాద్ స్కూల్ యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించింది. మంగళవారం స్కూల్ 16వ వార్షికోత్సవాన్ని స్కూల్ కరస్పాండెంట్లు నాగరాజు గుప్త, ప్రసాద్, గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది పదో తరగతిలో 590 మార్కులు, ఆపైన మార్కులు పొందిన విద్యార్థులు ఫయాజ్, తనన్య, అఫ్రిది, బాలాజీకి రూ.10వేల ప్రోత్సాహక నగదు, జ్ఞాపికలతో సన్మానించారు. అలాగే 580 మార్కులు, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు, పలు సబ్జక్టుల్లో 100కు వంద మార్కులు, 2024 పాలీ సెట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన మొత్తం 33 మంది విద్యార్థులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గాయత్రి, ఇన్‌చార్జులు మల్లికార్జున, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

చర్చి స్కూల్‌లో సరస్వతి పూజ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని చర్చి స్కూల్‌లో 2024-25 తొమ్మిది, పదో తరగతి విద్యార్థినులు సరస్వతీ పూజ, వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చేశారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. పలు క్లాసికల్, వెస్ట్రన్ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయులు సుజాత, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గజవాహనంపై ఊరేగిన విశ్వనాథుడు



గజవాహనంపై పార్వతీ పరమేశ్వరులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మో త్సవాల్లో భాగంగా ఏడోరోజు మంగళవారం కాశీవిశాలాక్షి సమేత విశ్వేశ్వరుడు గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం శివలింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పుష్పా లంకరణ, ప్రత్యేక పూజ నిర్వహించారు. ఆలయంలో దీక్షాహోమం చేశారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన గజవాహనంపై స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి మొదటిరోడ్డు, రెండో రోడ్డు మీదుగా ఊరేగించారు. ఊరేగింపులో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేసిన కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా కోర్టు న్యాయాధికారి శ్రీనివాస్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, న్యాయాధికారి



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పాతూరు చెన్నకేశవస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ప్రాంగణలో మంగళవారం సాయంత్రం లక్షదీపోత్సవం ఏర్పాటు చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా కోర్టు న్యాయాధికారి శ్రీనివాస్ హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... సనాతన సంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలను అందరూ దర్శించుకోలేరని, అయితే దర్శించుకున్న అనుభూతి కలిగేలా ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇలా ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. బ్రహ్మకుమారి శారద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● ఎంపీ అంబికా ● గిరిజన గురుకుల పాఠశాల తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి వచ్చే సాయంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి, భోజనం అందించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆదేశించారు. ఆయన మంగళవారం నగరంలోని నవోదయ కాలనీలో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా చిన్నచిన్న మార్పులు చేస్తే బాగుంటుందని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖాధికారులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే... నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. అనంతరం విద్యార్థినులకు ఎంపీ అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రామాంజనేయులు, ప్రిన్సిపాల్ పార్వతి, రిటైర్డ్ హెచ్ఎం అంజనేయులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రిస్టియన్లకు రాయితీ రుణాలు : స్వామిదాస్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ యువతకు స్వయం ఉపాధి రాయితీ రుణాల మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్స రానికి సంబంధించి ఈ పథకం అమలు కోసం రూ.4.86 కోట్లు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఇందులో రూ.2.43 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం రాయితీగా అందిం చనుందన్నారు. మిగతా మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణాన్ని అందిస్తారన్నారు.

సైబర్ నేరాల బారిన పడొద్దు: ఎస్పీ



నగరంలో 2.5కె రన్‌లో ఎస్పీ, అధికారులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో జిల్లా ప్రజలు బాధితులు కాకూడదనేదే జిల్లా పోలీసుల ధ్యేయమని ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు. సైబర్ సేఫ్ అనంతపురం కోసం జిల్లా పోలీస్ శాఖ సైబర్ సురక్ష(మన భద్రత-మన బాధ్యత)లో భాగంగా చేపట్టిన 2.5కె రన్‌ను స్థానిక పోలీస్ పరేడ్ మైదానం వద్ద జిల్లా ఎస్పీ జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఎస్పీ సారథ్యంలో ప్రారంభమైన ఈ రన్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్, సప్తగిరి సర్కిల్, సుభాష్‌రోడ్డు, క్లాక్‌టవర్, కోర్టు రోడ్డు మీదుగా తిరిగి పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుంది. సైబర్ మోసాల అప్రమత్తత కోసం సహకరించిన వారికి, పోలీస్ అధికారు లకు మెమెంటోలు అందజేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సీఐలు షేక్ జాకీర్, సాయినాథ్, శ్రీకాంత్‌యాదవ్, శాంతిలాల్, శేఖర్, రఘుప్రసాద్, ఆర్‌ఐలు మధు, బాబు, రాముడు, ఆర్‌ఎస్‌ఐలు జాఫర్, మగ్బుల్, రమేష్‌నాయక్, కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశా లలో సైబర్ సురక్షలో భాగంగా సైబార్ మోసాలపై అవగాహన కార్యక్ర మాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్పీ హాజరై మాటాడారు. అనంత రం సైబర్ నేరాలపై డ్రాయింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించి, గెలు పొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంగీతకుమారి, ఎస్ఐ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

నడిమివంక విస్తరణ చేపట్టాలని ధర్నా

అనంతపురం క్లాక్‌టవర్/క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నడిమి వంకను విస్తరించి, రక్షణ గోడ నిర్మించాలని స్త్రీవిముక్తి సంఘటన, ఏఐఎఫ్‌టీయూ-న్యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట స్త్రీవిముక్తి సంఘటన, ఏఐఎఫ్‌టీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీవిముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి మల్లేశ్వరి, ఏఐఎఫ్‌టీయూ-న్యూ జిల్లా కార్యదర్శి నాగభూషణం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడి వినతిపత్రాన్ని మేయర్ వసీంకు అందజేశారు. నాయకులు చంద్రశేఖర్, వెంటకలక్ష్మి, రాధమ్మ, హాజీ, రాజు, రామాంజినేయులు, బాలు తదితరులు పాల్గొన్నారు.

కవి సింగమనేనికి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్/ సెంట్రల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అనంత కథా సాహిత్యానికి జీవం సింగమనేని నారాయణ అని శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పామిరెడ్డి దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. సింగమనేని నారాయణ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ, శ్రీసాయి డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వ ర్యంలో మంగళవారం కళా శాల సెమినార్ హాల్‌లో సింగమనేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్కేయూ తెలుగు అకాడమిక్ కన్సల్టెంట్ నానీల నాగేంద్ర, కవులు కంబదూరి షేక్ నబీరసూల్, జెట్టి జయ రాం, అలీఖాన్, చెట్ల ఈరన్న, అల్తాఫ్, అంకె రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సుబ్బిరెడ్డి మృతి రైతు ఉద్యమానికి తీరని లోటు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడా సుబ్బిరెడ్డి మృతి రైతు ఉద్యమానికి తీరనిలోటు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సంతాపసభలో సుబ్బిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు రామాంజినేయులు, శివారెడ్డి, మధుసూదన్ నాయుడు, విరూపాక్షి, రాజారాంరెడ్డి, బీహెచ్ రాయుడు, వలి, సువర్ణమ్మ, చిదంబరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం



మందులు అందజేస్తున్న రవికాంత్ రమణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : కొప్పల మీనాక్షమ్మ ఆరో వర్ధంతి సందర్భంగా రవికాంత్ రమణ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక ఆదిత్య మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిలో మంగళవారం పలువురు వృ ద్ధులకు బీపీ, షుగర్, ఈసీజీ వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి మందులను పంపిణీ చేశారు. వైద్యులు రాజశేఖర్ స్వరూప్, ప్రవీణ్‌కుమార్, శ్వేత, శాంతిస్వరూప్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి : ఎస్ఈ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ పనులు వేగవంతం చేసి మార్చి ఆఖరిలోగా పూర్తి అయ్యేలా చూడాలని పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం సిబ్బందికి సూచించారు. ఆయన మంగళవారం నగరంలోని ఎస్ఈ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఈఈ ప్రభాకర్‌రెడ్డితో కలిసి డీఈలు, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. పథకాల వారీగా సమీక్షించి, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా నూతన పనులకు అంచనాలు తయారు చేయాలని సూచించారు. అనంతపురం డీఈ రామచంద్రారెడ్డి, ఈఈ పీఏ గురిమూర్తి రావు, రాప్తాడు డీఈ లక్ష్మీనారాయణ, సీఐయూ డీఈ, ఈఈ పీఏ భరత్‌ప్రకాష్‌రెడ్డి, డీఈలు, ఎస్ఈ పీఏలు రాజేంద్రప్రసాద్, చంద్రకుమార్, తాడిపత్రి డీఈ రాజేశ్వరరెడ్డి, గుత్తి డీఈ మురళీధర్, కళ్యాణదుర్గం డీఈ నాగేంద్రకుమార్, ఉరవకొండ డీఈ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా శివాలయాలన్నీ వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. కాగా వేడుకల్లో భాగంగా మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో బుధవారం వేకువజామునుంచే కాశీవిశ్వేశ్వరుడికి రుద్రాభిషేకాలు, యామపూజలు నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించి, సాయంత్రం స్వామివారిని నందివాహనంపై ఊరేగించనున్నారు. అలాగే అనంత శివారాధన సమితి ఆధ్వర్యంలో మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో వేడుకలు నిర్వహించనున్నారు. రామచంద్రనగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో కైలాసం సెటప్‌ను తీర్చిదిద్దారు. పాతూరులో చెన్నకేశవస్వామి ఆలయం సమీపంలో బుధవారం ఉదయం నుంచి ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం, కోటిలింగ దర్శనం ఏర్పాటు చేయనున్నారు. కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలు, శారదానగర్ శివబాలయోగి ఆశ్రమం, పాతూరు విరూపా క్షేశ్వరాలయం, ఆరోరోడ్డు అమృతలింగేశ్వర ఆలయం, సంగ మేష్ నగర్‌లో షిర్డీసాయిబాబా ఆలయాల్లోనూ రుద్రాభిషేకాలు, యామపూజలు, శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

టీటీడీ కల్యాణమండపంలో జాగరణకు ఏర్పాట్లు

టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో తొమ్మిదేళ్లుగా మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం 5 నుంచి గురువారం తెల్లవారు జామున 5 గంటల వరకు జాగరణ నిర్వహించనున్నారు. మహాకుంభమేళాకు వెళ్లలేనివారి కోసం ప్రత్యేకంగా త్రివేణి సంగమం నుంచి తీసు కొచ్చిన పవిత్రజలాలతో సంప్రోక్షణ చేయనున్నారు. హిమాలయాల నుంచి తెచ్చిన పంచముఖ రుద్రాక్షలను, వారణాసి నుంచి తెచ్చిన కాల భైరవస్వామి కంకణాలను భక్తులకు అందజేయనున్నారు. రాత్రి శివ పార్వతుల కల్యాణోత్సవం, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పా టు చేసినట్లు హిందూ ధర్మప్రచార పరిషత్ సభ్యుడు శ్రీపాద వేణు తెలిపారు.

● శింగనమల: మహా శివరాత్రి వేడుకలకు మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. శింగనమలలోని చిన్నకాలువ భవానీశంకర ఆలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అలాగే మండలంలోని రుషింగమయ్య, చిన్నజలాలపురం, ధనరామేశ్వర కొండ మీది ఆలయాలతో పాటు పలు ఆలయలలో శివరాత్రి సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

5లోగా ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వేని మార్చి 5వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. అనంతపురం అర్బన్ పరిధిలోని 14వ డివిజన్ కమలానగర్‌లో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వేని జిల్లా కలెక్టర్ మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో 89,503 దాకా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు ఉండగా ఇప్పటి దాకా 37,606 ఎంఎస్ఎంఈల సర్వే పూర్తి చేశారన్నారు. మిగతా వాటిని మార్చి 5వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, ఐపీఓలు రవీంద్రనాథ్‌రెడ్డి, నిశాంత్, భువనేశ్వరి, నగర పాలక సంస్థ ఈఈ షాకీర్ హుస్సేన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమృత్ పనులను వేగవంతం చేయండి

అమృత్ పథకం కింద మున్సిపాలిటీలలో చేపడుతున్న పనులను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. అనంతపురం నగరంతో పాటు గుంతకల్, తాడిపత్రి తదితర మున్సిపాలిటీలలో అమృత్ కింద జరుగుతున్న పనులన్నీ త్వరగా పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్‌హెల్త్ ఈఈ ఆదినారాయణ, విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్, మున్సిపల్ కమిషనర్లు, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్ల నిర్మాణంలో అలసత్వం వద్దు

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఆర్‌డీ కృష్ణతేజ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీ ణ ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ అనుబంధ పనుల్లో చేపడు తున్న ఫారంపాండ్ల నిర్మాణంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేదిలేదని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కమిషనర్ (సీఆర్‌డీ) కృష్ణతేజ పేర్కొన్నారు. ఆయన మంగళవారం రాజధాని అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో మార్చి నెలాఖరులోగా లక్ష ఫారంపాండ్లు (నీటికుంట)ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో వెను కబడి ఉన్న గుంతకల్లు, బుక్కరాయసముద్రం, బొమ్మనహాళ్ మండలా ల ఏపీఓలకు పురోగతి లేకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీడీని ఆదేశించారు. మార్చిలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి లక్ష ఫారంపాండ్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలోనే దాదాపుగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. అన ంతరం డ్వామా పీడీ సలీంబాషా మాట్లాడుతూ జిల్లాకు 5780 ఫారంపాండ్లు కేటాయించారని, ఇప్పటి వరకు 867పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీలు విజయ్‌కుమార్, అయేషా, రమేష్‌నాయక్, చెన్నకేశవయ్య, శశికళ తదితరులు పాల్గొన్నారు.

'తాగునీటి పైపులైన్ నిర్మాణానికి సహకరించండి'



చోళసముద్రం గ్రామస్థులతో మాట్లాడుతున్న రూరల్ మండల నాయకులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని పైపులైన్ పనులకు సహకరించాలని టీడీపీ మండల నాయకులు చోళసముద్రం గ్రామస్థులను కోరారు. ఆ మేరకు మంగళవారం మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ, సాంస్కృతిక విభాగం మండల అధ్యక్షుడు రత్నమోహన్‌తో పాటు సంబంధిత అధికారులు కూడేరు మండలంలోని చోళసముద్రం గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా జలజీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న పైపులైన్ పనులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా చూడాలని గ్రామస్థులను, రైతులను వారు కోరారు. అనంతరం గ్రామ సమీపంలో జరుగుతున్న పైపులైన్ పనులను పరిశీలించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం

● రాప్తాడు, ప్రసన్నాయపల్లి పశువైద్యశాలల్లో సిబ్బంది ఇష్టారాజ్యం



ఉదయం 9 గంటలైనా తెరుచుకోని రాప్తాడు పశువైద్యశాల



మధ్యాహ్నం 3 గంటలకే మూతపడిన ప్రసన్నాయపల్లి పశువైద్యశాల

రాప్తాడు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న మండలంలోని రాప్తాడు, ప్రసన్నాయపల్లి పశువైద్యశాలలకు పశు వైద్యాధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కారు. మధ్యాహ్నం తరువాత పూర్తిగా విధులకు డుమ్మా కొడుతున్నారు. దీంతో రైతులు వైద్యులు ఉన్నప్పుడే పాడి పశువులకు చికిత్స లు చేయించుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులోని పశు వైద్యశాలలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్, లైవ్ స్టాక్ అధికారి, ఇద్దరు అటెండర్లు పనిచేస్తున్నారు. ప్రసన్నాయపల్లి పశు వైద్యశాలలో ఒక జూనియర్ వెటర్నరీ అధికారి, అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. అయితే వారు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని మంగళవారం ఆంధ్రజ్యోతి పరిశీలనలో బయట పడింది. రోజూ ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నట్లు పలువురు స్థానికులు వెల్లడించారు. రాప్తాడులో ఉదయం 9 గంటలకు పశు వైద్యశాలను ప్రారంభించాల్సి ఉండగా అరగంట ఆలస్యంగా 9:30కు తాళాలు తీశారు. మధ్యాహ్నం ఒంటిగంటకు తాళం వేసి వెళ్లిపోయారు. తిరిగి 2 గంటల నుంచి 4 గంటల వరకూ పశువైద్య శాలలో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది తిరిగిరాలేదు. జిల్లా పశువైద్య కార్యాలయంలో ఏదైనా పని నిమిత్తం అసిస్టెంట్ డైరెక్టర్ వెళ్లినా... సిబ్బందిలో ఏవరో ఒకరైనా పశువైద్య శాలలో ఉంచాలి.

ఫీల్డ్‌కు వెళుతున్నామని డుమ్మా

మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ గ్రామాలకు దూరంగా పొలాల్లో ఉన్న పశువులకు చికిత్స చేసేందుకు వెళుతున్నా మని చెబుతూ అధికారులు, సిబ్బంది విధులకు పూర్తిగా డుమ్మా కొడు తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నా యి. వాస్తవంగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ బయట ప్రాం తానికి వెళ్లి పశువులకు చికిత్స చేయలేదని తెలుస్తోంది. గ్రామానికి దూ రంగా పొలాల్లో ఉన్న పశువులకు అవసరమైనప్పుడు చికిత్స అందించేందు కు ప్రతి గ్రామ సచివాలయంలో ఏహెచ్ఏ (అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్) ఉంటారు. అలాగే ప్రసన్నాయపల్లి పశువైద్యశాలను మంగళ వారం ఉదయం ఆలస్యంగా 9 గంటల తరువాత ప్రారంభించారు. మధ్యాహ్నం ఒంటి గంట కూడా కాకముందే పశువైద్యశాలకు తాళం వేసి వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత అందుబాటులో ఉండాల్సిన జూనియర్ వెటర్నరీ అధికారి, అటెండర్ కూడా తిరిగిరాలేదు.

● ఈ విషయంపై రాప్తాడు పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ప్రకాష్‌ను వి వరణ కోరగా... మధ్యాహ్నం నుంచి ఫీల్డ్‌కు వెళుతున్నామని తెలిపారు. ఉదయం సమయానికి పశువైద్యశాల తెరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త వార్తలు

4 నుంచి గవిమఠం బ్రహ్మోత్సవాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠం బ్రహ్మోత్సవాలను మార్చి 4 నుంచి 11వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు మఠం సహాయ కమిషనర్ రాణి తెలిపారు. మంగళవారం గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 4న కంకణాధారణం, 5న నాగాభరణోత్సవం, 6న నెమలివాహనోత్సవం, 7 అడ్డపల్లకి ఉత్సవం, 8న బసవేశ్వర వాహనోత్సవం, 9న మహారథోత్సవం, 10న లంకాదహనం, 11న అశ్వవాహనం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, విజయ్‌భాస్కర్, రామాంజనేయులు, ఎర్రిస్వామి, బోస్, గోవిందు, రహంతుల్లా, ప్రభాకర్, నిరంజన్‌గౌడ్, గౌతమ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

8 నుంచి బ్యాడ్మింటన్ టోర్నీ

చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8, 9, 10 తేదీల్లో ఎస్కేఆర్సీ క్లబ్ ఆధ్వర్యంలో షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రవీంద్రనాథ్, ఉపాధ్యక్షుడు ఎర్రిస్వామి నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9908625717, 9492554774 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఆరా

పుట్లూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ పంచాయతీ కార్యదర్శిపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వందకోట్లు ఇక్కడ.. నాకే పనిచెబుతారా..?' అన్న కథనానికి అధికారులు స్పందించారు. ఏ పంచాయతీకి కార్యదర్శిగా ఉన్నాడని, అతడి వ్యవహారశైలిపై మండల అధికారులను అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ పంచాయతీ కార్యదర్శి వివాదాస్పదంగా మారడంతో ఉన్నతాధికారులకు విషయం తెలిపినట్లు ఎంపీడీఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఇళ్లను క్రమబద్ధీకరించుకోండి

శెట్టూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అభ్యంతరం లేని స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న పేదలు వాటిని క్రమబద్ధీకరించుకోవచ్చునని తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఇటీవలే జీవో నెంబర్ 30ని విడుదల చేసిందన్నారు. 2019 ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న వారందరికీ క్రమబద్ధీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. 150 చదరపు గజాలలో ఇల్లు నిర్మించుకుని వుంటే ఉచితంగానే క్రమబద్ధీకరిస్తామని, 151 నుంచి 300 చదరపు గజాలు వుంటే స్థలం విలువలో 15 శాతం, 301 నుంచి 450 చదరపు గజాలు వుంటే స్థలం విలువలో వందశాతం చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. రెండేళ్లు పూర్తయితే ఇళ్లపై యజమాని హక్కులు వస్తాయని పేర్కొన్నారు.

ఘర్షణలో వ్యక్తికి గాయాలు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో మంగళవారం ఇంటి వద్ద జరిగిన ఘర్షణలో పరంధాముడు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ... గ్రామానికి చెందిన పరంధాముడు, ఓబులేసు కుటుంబ సభ్యులు కలిసి ఇంటి దగ్గర చిన్నపాటి విషయంలో మాట, మాట పెరిగి కర్రలతో దాడి చేకున్నారు. ఈ దాడిలో పరంధాముడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పచ్చదనం పెంచేందుకు ఎమ్మెల్యే కృషి

తాడిపత్రి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత కోసం ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి కృషి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విమర్శలు చేయడం తగదని కౌన్సిలర్లు మల్లికార్జున, విజయ్‌కుమార్, షెక్షావలి మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సజ్జలదిన్నె గ్రామాన్ని ఎంపిక చేసుకొని పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం చేస్తుంటే వాటిపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెద్దారెడ్డి వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పోలీసులను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయలేదా అని ప్రశ్నించారు. పెద్దవడుగూరు ఎస్‌ఐ ఆంజనేయులు పై పదేపదే మాట్లాడడం ఎంతవరకు సమంజసమని అన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

యాడికి, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను మంగళవారం సీజ్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. మండలంలోని రాయలచెరువు క్రాస్‌వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను గుర్తించి సీజ్ చేసినట్లు వివరించారు.

మట్కాబీటర్ అరెస్ట్

తాడిపత్రి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఒక లాడ్జిలో మట్కాబీటర్ అన్వర్‌బాషాను మంగళవారం అరెస్ట్‌చేసి రూ.1.30లక్షలు స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి బీటర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదుచేశామని పేర్కొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

పుట్లూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శనగలగూడూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. ఈ మేరకు రఘునాథ్‌రెడ్డి మరో వ్యక్తిని అరెస్ట్‌చేసి 95 బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటనరసింహ తెలిపారు.

బస్సు, ట్రాక్టర్ ఢీ: ముగ్గురికి గాయాలు

తాడిపత్రి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో ట్రాక్టర్- బస్సు ఢీకొనడంతో బస్సులోని డ్రైవర్ గురుస్వామితోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బనగానపల్లి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు బుగ్గ వైపు నుంచి తాడిపత్రికి వస్తున్న నాపరాళ్ల ట్రాక్టర్‌ను ఢీకొనడంతో బస్సులో డ్రైవర్‌తోపాటు ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయని తెలిపారు. ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో నాపరాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయన్నారు.



ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు







గుంతకల్లు మండలంలోని బుగ్గసంగమేశ్వర ఆలయం వద్ద ఏర్పాట్లు, గుత్తిలో విద్యుత్ కాంతులతో కాశీవిశ్వేశ్వర, నగరేశ్వర ఆలయాలు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గసంగాల గ్రామంలో వెలసిన బుగ్గసంగమేశ్వరస్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు ఆలయం ముస్తాబయింది. బుధవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి 12 గంటలకు పార్వతీ దేవి, బుగ్గసంగమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈఓ కృష్ణయ్య తెలిపారు. గురువారం ఉదయం అభిషేకం, మహామంగళహారతి, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం, శుక్రవారం ఉదయం స్వామి వారి వసంతోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి అనుబంధమైన విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరఆలయం, దోనిముక్కలలోని వీరుపాక్షేశ్వరస్వామి ఆలయం, కసాపురం రోడ్డులోని రాతిగుడి రామలింగేశ్వరస్వామి, పాతగుంతకల్లులోని రామలింగేశ్వరస్వామి, గుంతా రామలింగేశ్వర స్వామి, మార్కండేయస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

గుత్తి: మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలో శివాలయాలను ఆలయ నిర్వాహకులు ముస్తాబు చేశారు. నగరేశ్వర ఆలయం, కాశీవిశ్వేశ్వర ఆలయం, లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, గౌతమేశ్వర ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం బారీకేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయ గోపురాలను విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు.



కూడేరు సంగమేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ రాజు

కూడేరు: ప్రసిద్ధి చెందిన జోడు లింగాల సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకల కోసం మంగళవారం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు రానుండడంతో బందోబస్తు ఏర్పాట్లపై సీఐ రాజు ఆలయ అధికారులతో చర్చించారు. గురువారం మరుట్ల 3వ కాలనీలో ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో రాత్రిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు.

గజవాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు



గజవాహనంపై స్వామి

తాడిపత్రి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గజవాహనం పై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం గజవాహనంపై ఉంచి మంగళవాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.

సీహెచ్‌సీ అభివృద్ధికి చర్యలు

ఉరవకొండ,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్ తెలిపారు. స్థానిక ఆసుపత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీహెచ్‌సీని రాష్ట్రంలోనే ఆదర్శంగా చేయాలని మంత్రి కేశవ్ ఆదేశంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటస్వామిచౌదరి, డాక్టర్లు గంగాధర్, ప్రతిమ పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ హరీష్, ఆదోని బ్రాంచ్ మేనేజర్ సోమన్న మంగళవారం బీరువాను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు, హెచ్‌ఎం ఆర్‌హెచ్ కాశీనాథ్ పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలపై రైతులకు అవగాహన

కుందుర్పి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ అమలు చేస్తున్న పథకాలపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఉద్యాన పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ గురించి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ రైతులకు వివరించారు. కంబదూరు ఉద్యాన శాఖాధికారిని గౌసియా మాట్లాడుతూ.. తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు రాయితీతో అందిస్తున్నామని తెలిపారు. మామిడి సాగు చేసే రైతులకు మ్యాంగో ఫ్రూట్ కవర్లు 50 శాతం రాయితీతో ఇస్తామని వివరించారు.

మున్సిపాలిటీకి నాలుగు వాహనాల వితరణ



మున్సిపాలిటీకి అందజేసిన వాహనాలు

తాడిపత్రి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సొంత నిధులు వెచ్చించి నాలుగు చెత్తసేకరణ వాహనాలను విరాళంగా అందించారని కౌన్సిలర్లు విజయ్‌కుమార్, మల్లికార్జున, షెక్షావలి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొంతకాలంగా మున్సిపాలిటీకి చెత్తసేకరణకు వాహనాలు తక్కువగా ఉండడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు ఎలక్ట్రికల్ చెత్తసేకరణ వాహనాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు అందజేశామని తెలిపారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి, మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పోస్ట్ కార్డులను పంపిచారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొరుగు సేవల కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తుందని, ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తుందని ఆశించారని, చివరకు నిరాశ మిగిల్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్ కుడి కాలువలో తగ్గిన నీరు



కాలువలో తగ్గిన నీటి ప్రవాహం

కూడేరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పెన్న అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కుడికాలువకు వస్తున్న నీరు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. మంగళవారం కుడికాలువలో 540 క్యూసెక్కులకు తగ్గించారు. ప్రస్తుతం పీఏబీఆర్ డ్యాంలో నీటి నిల్వ 3.134 టీఎంసీల వద్దకు చేరింది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో లేకపోవడంతో కుడికాలువతోపాటు తాగునీటి పథకాలకు నీరు వెళుతుండటంతో డ్యాంలో నీటిమట్టం తగ్గిపోతోంది. త్వరలోనే కుడికాలువకు నీరు బంద్ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

రుణం పేరుతో మోసం.. బాధితుల ఆందోళన

ఉరవకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రుణాలు మంజూరు చేస్తామని, డిపాజిట్లు కట్టించుకుని మోసం చేశారు. దీంతో బాధితులు ఆ సంస్థ వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. పట్టణంలోని పాత స్టేట్‌బ్యాంకు సమీపంలో వీడీ లక్ష్మీనిధి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రజల నుంచి డిపాజిట్లు కట్టించుకుంది. రూ.20వేలు డిపాజిట్ చేస్తే రూ.లక్ష రుణం ఇస్తామని నమ్మించి డిపాజిటర్లను మోసం చేశారు. డబ్బు కట్టిన 45 రోజులకే రుణం ఇస్తామని చెప్పడంతో సుమారుగా 30 మంది దాకా డబ్బులు డిపాజిట్ చేశారు. రణాలు ఇవ్వకపోవడంతో బాధితులు సంస్థ నిర్వాహకులను నిలదీశారు. వారితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులకు తెలియజేస్తామని చెప్పడంతో డిపాజిట్‌దారులు వెళ్లిపోయారు.

పురాతన రహదారికి మోక్షం



శివాలయం ముందు వేస్తున్న సీసీ రోడ్డు

కణేకల్లు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో బొడ్డురాయి నుంచి శివాలయానికి వెళ్లే పురాతన రహదారికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు వేసింది. అనేక ఏళ్లుగా భక్తులు శివాలయానికి వెళ్లాలంటే గుంతలు, ముళ్లకంపలు ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారి ఏర్పాటుకు నివేదిక పంపింది. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 5 లక్షలు మంజూరు కాగా టీడీపీ నాయకులు దగ్గరుండి సీసీరోడ్డును వేయించారు.

మురుగునీటి శుద్ధి ప్లాంటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో మురుగునీటిని శుద్ధి చేయు కర్మాగారాన్ని నిర్మించడానికి అనువైన స్థలాలను ఆర్డీవో వసంతబాబు, తహసీల్దార్ భాస్కర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మున్సిపాల్టీ పరిధిలోని దొడగట్టలో సచివాలయ సిబ్బంది పీ4 సర్వేను నిర్వహిస్తుండగా ఆర్డీవో తనిఖీ చేశారు.

టీడీపీ ఎంపీటీసీ సభ్యుడి మృతి



ఉరవకొండ,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకౌకుంట్ల టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందారు. ఎంపీటీసీ మృతి పట్ల ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

942 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 942 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు మంళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్ఎస్ ఫేజ్-2కు 788 క్యూసెక్కులు వెళుతున్నాయని వివరించారు. రిజర్వాయరులో ప్రస్తుతం 1.623 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఎండీ

గుత్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పలు పేపర్ ప్రజంటేషన్ చేసి జాతీయ స్థాయి గుర్తింపు సాధించనట్లు కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గుంటూరులోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన బూట్ క్యాంప్‌లో తమ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న తిలక్, ముజమిల్, మనోబిరం, అర్ముల్, తృతీయసంవత్సరం చదువుతున్న రేవంత్ అత్యంత ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్ అభినందించారు.

విద్యార్థినులకు అభినందన

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీశంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముండ్ల విమలరాణి అనే ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థిని మంగళవారం కళాశాల అధ్యాపక బృందం అభినందించింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ పి.గోపాల్ మాట్లాడుతూ మహారాష్ట్ర రాష్ట్రంలోని కొల్హాపూర్ పట్టణంలోని శివాజీ విశ్వవిద్యాలయియంలో ఈనెల 18నుంచి22వ తేదీ వరకు నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో విమలరాణి పాల్గొని వివిధ అంశాల్లో ప్రతిభ కనబరించిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు శివయ్య, వై.నాగార్జున పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్ : కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విద్యార్థిని, ఎన్ఎస్ఎస్ వలంటీర్ జి. వనితను ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అభినందించారు. ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు కొల్హాపూర్ శివాజీ విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్ పొంది కళాశాలకు తిరిగి వచ్చిన సందర్భంగా మంగళవారం ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు. ఎనిమిది రోజుల శిబిరంలో వనిత తన అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, దొడ్డనాగప్ప తదితరులు పాల్గొన్నారు.





గుంతకల్లులో విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్, రాయదుర్గంలో..

కసాపురంలో ఆంజనేయస్వామి ప్రాకారోత్సవం



ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. రథంలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చారు. అర్చకులు స్వామికి పూజలు చేశారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ

కూడేరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పంటల సాగు చేసే సమయంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఇప్పేరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పంటల సాగుకు ఎక్కువ ఖర్చులు పెడుతున్నారని, తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడి సాధించవచ్చు అన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి రైతులతో వివరాల అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గడ్డికి నిప్పు



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న గడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం నిప్పుపెట్టారు. ఆ మంటలు పక్కనే ఉన్న వెజిటబుల్ నర్సరీలకు అంటుకున్నాయి. వెంటనే చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే పెంచలయ్య అనే రైతుకు చెందిన వెజిటబుల్ నర్సరీ కొంతమేర కాలిపోయింది. ఆ ప్రదేశంలో పదుల సంఖ్యలో వెజిటబుల్ నర్సరీలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వుండటంతో పూర్తిస్థాయిలో వ్యాపించి వుంటే భారీ ఆస్తి నష్టం సంభవించేదని రైతులు తెలిపారు.

రైల్వే గ్రౌండ్ జిమ్‌ను సిద్ధం చేయండి



డీఈఎన్‌కు వినతి పత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

గుంతకల్లు, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే గ్రౌండులో జిమ్‌ను ఆధునికీకరించాలని, గ్రౌండ్ లాన్ పనులు త్వరగా పూర్తిచేయాలంటూ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు రైల్వే సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) శ్రీనివాస్‌కు విన్నవించారు. మంగళవారం ఉదయం డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లిన మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గ్రౌండు సమస్యలను సీనియర్ డీఈఎన్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు ఎన్ రామాంజనేయులు, నాయకులు ఆర్‌హెచ్‌ఎం కాశీనాథ్, సుబ్బరాయుడు, పురుషోత్తం, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ



సరస్వతి పూజలో విద్యార్థులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల కోసం పురోహితులు సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న సరస్వతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

యాడికి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను మంగళవారం యాడికి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా పరీక్షల చీఫ్ మారుతి, డీఓ రాజేష్ మాట్లాడుతూ.. మార్చి 1నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు.

లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపు డీలర్లు.. రేషన్‌కార్డుల లబ్ధిదారులకు అందుబాటులో ఉండి నిత్యావసర సరుకులను సక్రమం గా అందించాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చౌకదుకాణాల నిర్వాహకులు, ఎండీ యూ వాహనదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతినెలా 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఎండీ యూ వాహన నిర్వాహకులు తమకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో డీటీ శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సదరం రీ వెరిఫికేషన్ నిర్వహించారు. కళ్యాణదుర్గం రూరల్, బ్యాడరహళ్లి, చాపిరి గ్రామ పంచాయతీలో ఉన్న దివ్యాంగులు, పింఛన్‌దారులు, వారి సదరం సర్టిఫికెట్‌ను తనిఖీ చేశారు. సదరం రీ వెరిఫికేషన్ సెంటర్‌ను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు అమర బిందు రాజశేఖర్ పరిశీలించారు.

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ హీరోజీరావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడేతూ.. ప్రభుత్వం మద్దతు ధరతో జొన్నను కొనుగోలు చేయాలన్నారు. మండలంలోని కురవళ్లి, బొల్లనగుడ్డం, కళ్లహోళ, సిద్దరాంపురం, చంద్రగిరి తదితర గ్రామాలలో జొన్నపంట సాగు చేశారని అన్నారు. మరో వారంలో జొన్న కోతలు పూర్తవుతాయని అధికారులు, ప్రభుత్వం స్పందించి జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర వేత్తలుగా ఎదగాలని ఎస్‌వీఐఎస్ పాఠశాల డైరెక్టర్ మంజునాథ్ పేర్కొన్నారు. కొనకొండ్ల రోడ్డులోని ఎస్‌వీఐఎస్ పాఠశాలలో మంగళవారం సైన్స్‌ఫెయిర్‌ను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్‌ఫెయిర్‌లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ పవన్‌కుమార్, ఎంటీపీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమాన్‌ప్రసాద్, కరస్పాండెంట్ ఓంకారప్ప తదితరులు పాల్గొన్నారు.